1న ఆర్య వైశ్య వివాహ పరిచయ వేదిక

కాచిగూడ, ఆగస్టు 30: హైదరాబాద్ జిల్లా ఆర్యవైశ్య మహాసభ ఆధ్వర్యంలో తెలంగాణ వ్యాప్తంగా ఉన్న ఆర్య వైశ్య యువత కోసం వివాహ పరిచయ వేదికను నిర్వహిస్తున్నట్లు ఆర్యవైశ్య మహాసభ ఆర్గనైజర్ కూర రఘువీర్ తెలిపారు. వైశ్య హాస్టల్‌లో శుక్రవారం ఆయన మాట్లాడుతూ సెప్టెంబర్ 1వ తేదీన(ఆదివారం) ఉదయం 10 నుంచి సాయంత్రం వరకు కాచిగూడలోని వైశ్య హాస్టల్ హాల్లో వివాహ పరిచయ వేదికను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ వివాహ పరిచయ వేదికలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని యువత పాల్గొని వివాహ సంబంధాలు పెంపొందించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తెలంగాణ, ఏపీ ఆర్యవైశ్య కుల పెద్దలు హాజరుకానున్నట్లు పేర్కొన్నారు. వివరాలకు ఫోన్ నం. 92465 47563, 98499 10303లలో సంప్రదించాలని కోరారు. ఈ అవకాశాన్ని ఆర్యవైశ్యులు సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

యూఆర్ఎస్‌లో బోధనేతర సిబ్బందికి దరఖాస్తులు

సిటీబ్యూరో, ఆగస్టు 30(నమస్తే తెలంగాణ): సమగ్ర శిక్ష హైదరాబాద్ జిల్లా ప్రాజెక్టు కార్యాలయానికి చెందిన పట్టణ బాలుర గురుకుల పాఠశాలలో బోధనేతర సిబ్బంది కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు హైదరాబాద్ జిల్లా విద్యాశాఖాధికారి రోహిణీ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పది, డిగ్రీ అర్హతతో అకౌంటెంట్, వంట మనిషి, సహాయ వంట మనిషి, సెక్యూరిటీ గార్డు ఉద్యోగాలు ఉన్నాయని చెప్పారు. సెప్టెంబర్ 5 వరకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు తెలిపారు. హైదరాబాద్ డీఈఓ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

హెచ్‌సీయూ విద్యార్థికి డాక్టర్ దినేష్ మెమోరియల్ అవార్డు

కొండాపూర్, ఆగస్టు 30: గచ్చిబౌలిలోని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ విద్యార్థికి ప్రతిష్టాత్మక డాక్టర్ దినేష్ మెమోరియల్ అవార్డుకు ఎంపికైంది. వర్సిటీలో స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్ స్టడీస్‌లో హెల్త్‌కేర్ అండ్ హాస్పిటల్ మేనేజ్‌మెంట్ (ఎంబీఏ)లో రెండో సంవత్సరం చదువుతున్న డాక్టర్ ఆర్య అగర్వాల్ ఈ అవార్డుకు ఎంపికైనట్లు యాజమాన్యం శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపింది. హైటెక్ సిటీలోని యశోద హాస్పిటల్‌లో నిర్వహించిన డాటాకాన్ – 2024 సదస్సులో ఆర్య అగర్వాల్ 'డాటా డ్రైవెన్ డిసిషన్ మేకింగ్ ఇన్ ఎవిడెన్స్ – బేస్డ్ ప్రాక్టీస్' అంశంపై ప్రెజెంటేషన్ ఇచ్చింది. డేటా వినియోగం ద్వారా ఆరోగ్య సంరక్షణను పెంపొందించే వినూత్న విధానాలను ప్రత్యేకంగా వివరించినట్లు, అత్యుత్తమ ప్రజెంటేషన్‌కు గాను ఆర్య అగర్వాల్‌కు రూ.10 వేల నగదుతో పాటు డాక్టర్ దినేష్ మెమోరియల్ అవార్డును అందుకున్నట్లు తెలిపారు.

సంధ్యా సమయం..

పొద్దు క్రుంగి ఊరు సద్దుమణుగుతున్న వేళ. అప్పుడే వెలిగిన వీధి లైట్లు ఆ ఊరికి పహారా కాస్తున్నట్టు, కనిపించకుండా.. కనిపిస్తున్న ఆ గ్రామ ముఖచిత్రం..ఒక కోట గోడ వలె.., వెరసి ఈ చిత్రం ఒక చిత్రకారుడి కళాఖండాన్ని తలపిస్తున్నది. ఈ సుందర దృశ్యం నగర శివారులోని కోకాపేట గ్రామంలో 'నమస్తే తెలంగాణ' ఫొటోగ్రాఫర్‌కు శుక్రవారం కనిపించగా క్లిక్‌మనిపించారు. (చిన్న యాదగిరి గౌడ్)

ప్రగతిశీల మహా సభలను జయప్రదం చేయండి

రాష్ట్ర అధ్యక్షురాలు జి.ఝాన్సీ

చిక్కడపల్లి, ఆగస్టు 30: ప్రగతిశీల మహిళా సంఘం (పీఓడబ్ల్యూ) తెలంగాణ రాష్ట్ర 7వ మహాసభలను విజయవతం చేయాలని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు జి.ఝాన్సీ పిలుపునిచ్చారు. సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఝాన్సీ మాట్లాడారు. ఈ నెల 31, సెప్టెంబర్ 1, 2 తేదీల్లో ఈ మహాసభలను నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. మహాసభల్లో భాగంగా శనివారం వీఎస్‌టీ నుంచి ఇందిరా పార్క్ ధర్నా చౌక్ వరకు భారీ ర్యాలీ అనంతరం, బహిరంగ సభ నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. సెప్టెంబర్ 1, 2 తేదీల్లో బాగ్ లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ప్రతినిధుల సభను నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. సమావేశంలో ప్రధాన కార్యదర్శి అందె మంగ, ఉపాధ్యక్షురాలు జి.అనసూయ, కావేరి, పుష్ప, గీత పాల్గొన్నారు.

కుస్తీ పోటీలలో తోట సంకీర్తన్‌కు గోల్డ్ మెడల్

సిటీబ్యూరో, ఆగస్టు 30(నమస్తే తెలంగాణ): లాలా కేసరి స్టేట్ లెవల్ కుస్తీ పోటీలలో 70 కేజీల కేటగిరీలలో తోట సంకీర్తన్ యాదవ్ గోల్డ్ మెడల్ సాధించారు. జై భవాని వ్యాయామశాల లాలా పహిల్వాన్ బాలాజీ సింగ్ పహిల్వాన్ మెమోరియల్ రెజ్లింగ్ టోర్నమెంట్ 2024కు సంబంధించి ధూల్‌పేట జాలీపేట్ హనుమాన్ విగ్రహాల వద్ద జరిగిన పోటీలలో ఈ ప్రతిభ దక్కింది. ఈ సందర్భంగా జై భవానీ వ్యాయామశాల అర్జున్ పహిల్వాన్, జైహింద్ పహిల్వాన్ పాల్గొని తోట సంకీర్తన్ యాదవ్‌కు ప్రశంసా పత్రాన్ని అందజేశారు.

సెప్టెంబర్ 21 నుంచి మిస్టర్ అండ్ మిసెస్ హైదరాబాద్ పోటీలు

ఖైరతాబాద్, ఆగస్టు 30: మాక్స్ గ్లోబల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 21 నుంచి నగరంలో మిస్టర్ అండ్ మిసెస్ హైదరాబాద్ పోటీలు నిర్వహిస్తున్నట్లు ఫౌండేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ దినేశ్ తెలిపారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను తెలంగాణ గ్రంథాలయ సంస్థ చైర్మన్ రియాజ్, ఫౌండేషన్ కన్వీనర్ అమల, ఆర్గనైజర్ జి.స్వప్న, ఫిట్‌నెస్ ట్రైనర్ అను ప్రసాద్‌తో కలిసి ఆవిష్కరించారు. దీనేశ్ మాట్లాడుతూ, సంప్రదాయ చేనేత వృత్తిదారులను ప్రోత్సహించేందుకు ఈ పోటీలను నిర్వహిస్తున్నామని, పోటీల్లో పాల్గొనే మహిళలు, యువతులందరూ భారతీయ సంస్కృతికి, సంప్రదాయబద్ధమైన వస్త్రాలను ధరించి ర్యాంప్ వాక్‌లో పాల్గొంటారని తెలిపారు. మిస్, మిసెస్ హైదరాబాద్, జూనియర్ మిస్, మిస్టర్ అండ్ మిసెస్, గార్జియస్ మామ్ టు బీ (ఆరు నెలల నుంచి ఎనిమిది నెలల గర్భవతులు) విభాగాల్లో పోటీలను నిర్వహిస్తున్నామని, తెలంగాణ, ఏపీ, కర్ణాటక, తమిళనాడు, కేరళ రాష్ట్రాల నుంచి సుమారు 1500 మంది పాల్గొంటారని, 21 నుంచి ఐదు రోజుల పాటు ఆడిషన్స్ జరుగుతాయని, ఎంపికైన వారికి ఫైనల్ పోటీలు ఉంటాయన్నారు. 10 నుంచి 50 ఏండ్ల వయస్సులోపు ఉన్న వారు పాల్గొనవచ్చన్నారు. వివరాలకు ఫోన్ నం. 81212 50102లో సంప్రదించాలన్నారు.

బేబీ పాండ్స్‌ను సిద్ధం చేయండి

అధికారులకు మేయర్ ఆదేశం

సిటీబ్యూరో/బాలానగర్: గణేశ్ నిమజ్జనానికి చెరువులు, బేబీ పాండ్స్‌ను అన్ని వసతులతో సిద్ధం చేయాలని బల్దియా మేయర్ గద్వాల విజయలక్ష్మి అధికారులను ఆదేశించారు. వినాయక ఉత్సవాలను పురస్కరించుకొని శుక్రవారం కూకట్‌పల్లి జోన్‌లోని పలు చెరువులు, బేబీ పాండ్స్ వద్ద ఏర్పాట్లు, అభివృద్ధి పనులను పరిశీలించారు. హస్మత్‌పేట్ లేక్, బేబీ పాండ్, ప్రగతినగర్ చెరువు, ఐడీఎల్ లేక్, లింగం చెరువు, కొత్త చెరువు, వెన్నెల గడ్డ చెరువులు, బేబీ పాండ్స్ వద్ద వినాయక నిమజ్జన ఏర్పాట్లను మేయర్ పరిశీలించి, అధికారులకు పలు సూచనలు చేశారు. కేపీహెచ్‌బీలో ఓపెన్ జిమ్, అమ్మ భగవాన్ టెంపుల్ వద్ద బాక్స్ కల్వర్ట్ నిర్మాణ పనులు, మంగాపురం కాలనీలో ఫుట్‌బాల్ గ్రౌండ్ అభివృద్ధి పనులను ఆమె పరిశీలించారు. పనులను వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా వారంలోగా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులను మేయర్ ఆదేశించారు. చెరువులు, బేబీ పాండ్స్ వద్ద అవాంఛనీయ ఘటనలు జరగకుండా భద్రతా చర్యలు తీసుకోవాలని, వాహనాల పార్కింగ్‌కు ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. బేబీ పాండ్స్ చుట్టూ బారికేడ్లు ఏర్పాటు చేయాలని, నిమజ్జనం చేసిన విగ్రహాలు సంప్రదాయ పద్ధతిలో తొలగించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా చేయాలని, లైటింగ్, మొబైల్ టాయిలెట్స్, తాగునీరు, హెల్త్ క్యాంపులు, హెల్ప్ డెస్క్, అవసరమైన క్రేన్స్ ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులకు సూచించారు. పారిశుధ్య నిర్వహణ సక్రమంగా జరగాలన్నారు. చెరువుల నుంచి తొలగించిన గుర్రపు డెక్క, ఫ్లోటింగ్ మెటీరియల్‌ను తరలించకపోవడంతో రాంకీ ఏజెన్సీ, అధికారులపై మేయర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే వ్యర్థాలను తొలగించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు.

గ్రేటర్‌కు వర్ష సూచన

సిటీబ్యూరో, ఆగస్టు 30(నమస్తే తెలంగాణ): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్ప పీడనం ప్రభావంతో రాగల రెండు రోజులు గ్రేటర్‌లోని పలు చోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వానలు కురిసే అవకాశాలున్నట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు. కాగా, శుక్రవారం ఉదయం నుంచి రాత్రి వరకు నగరంలో గరిష్ట ఉష్ణోగ్రతలు 29.4 డిగ్రీలు, కనిష్ట ఉష్ణోగ్రతలు 22.7 డిగ్రీలు, గాలిలో తేమ 72 శాతంగా నమోదైనట్లు అధికారులు వెల్లడించారు.

యూపీఎస్సీకి ఏర్పాట్లు పూర్తి

సిటీబ్యూరో, ఆగస్టు 30(నమస్తే తెలంగాణ): వచ్చే నెల ఒకటో తేదీ, ఆదివారం జరిగే యూపీఎస్సీ పరీక్షను సజావుగా నిర్వహించాలని అడిషనల్ కలెక్టర్ అధికారులను ఆదేశించారు. జిల్లాలో 18 సబ్ సెంటర్స్ ఏర్పాటు చేశామన్నారు. 6,866 మంది అభ్యర్థులు పరీక్ష రాయనున్నట్టు తెలిపారు. సకాలంలో పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని కోరారు.

నేడు, రేపు ఇండియన్ బ్యాంక్ అసెట్స్ ఫెయిర్

ఖైరతాబాద్, ఆగస్టు 29: ఇండియన్ బ్యాంకు ఆధ్వర్యంలో సోమాజిగూడలోని జయ గార్డెన్స్‌లో నేడు, రేపు ఉదయం తొమ్మిది గంటల నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు అసెట్స్ ఫెయిర్ నిర్వహిస్తున్నట్లు తెలంగాణ, ఏపీ ఫీల్డ్ జనరల్ మేనేజర్ రాజేశ్వర్ రెడ్డి తెలిపారు. సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఇండియన్ బ్యాంకు ద్వారా ఇంటి స్థలాలు, కమర్షియల్, పారిశ్రామిక భవనాలు, ఇండ్ల కోసం రుణాలు తీసుకొని సకాలంలో చెల్లించకుండా ఎగ్గొట్టిన బకాయిదారులకు సంబంధించిన ఆస్తులను వేలం వేస్తున్నామన్నారు. అందులో భాగంగా బకాయిపడ్డ ఆస్తులకు సంబంధించిన వివరాలను ప్రజలకు తెలిపేందుకు రెండు రోజుల పాటు హైదరాబాద్‌తో పాటు విశాఖపట్నం, విజయవాడ, రాజమండ్రి, తిరుపతిలో ఈ ప్రదర్శనను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ ప్రదర్శనలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లు కలిపి మొత్తం 238 ఆస్తులకు సంబంధించిన వివరాలు ఉంటాయని, అలాగే, వాటికి సంబంధించిన పూర్తి సమాచారం www.ebrikay.com వెబ్‌సైట్‌లో పొందుపర్చామన్నారు. ఈ ప్రదర్శనలో ఎంపిక చేసుకున్న ఆస్తులను నేరుగా అక్కడికి వెళ్లి చూసుకోవచ్చన్నారు. సెప్టెంబర్ 11, 25న ఆస్తుల వేలం నిర్వహిస్తున్నామని, అందులో పాల్గొనే వారు ప్రాపర్టీ ధరలో పది శాతం ముందస్తుగా చెల్లించాలని, ఎవరూ ఎక్కువగా బిడ్ చేస్తారో వారికి ఆ ఆస్తిని కేటాయిస్తామని, అలాట్ కాని వారికి కట్టిన మొత్తాన్ని తిరిగి చెల్లిస్తామన్నారు. రూ.10 లక్షల నుంచి రూ. 3 కోట్ల విలువైన ప్రాపర్టీలకు సంబంధించిన వివరాలను ఈ ప్రదర్శనలో పెడుతున్నామన్నారు. అనంతరం, ఇండియన్ బ్యాంకు డీజీఎం సభ్యసాచి రాయ్, అసిస్టెంట్ జనరల్ మేనేజర్ అభిషేక్ రంజన్, యూవీ సుబ్బారావుతో కలిసి అసెట్స్ ఫెయిర్ పోస్టర్లను ఆవిష్కరించారు.

రెసిడెంట్ డాక్టర్ల సమస్యలపై వినతి

డాక్టర్ నాగేశ్వర్ రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేసిన తెలంగాణ జూడా నాయకులు

బన్సీలాల్‌పేట్, ఆగస్టు 30: తెలంగాణ జూనియర్ డాక్టర్స్ అసోసియేసన్ ప్రతినిధులు జాతీయ టాస్క్‌ఫోర్స్ కమిటీ చైర్మన్ డాక్టర్ డి.నాగేశ్వర్ రెడ్డిని శుక్రవారం కలిసి రెసిడెంట్ డాక్టర్ల సమస్యలపై వినతిపత్రం అందజేశారు. గచ్చిబౌలిలోని ఏఐజీ ఆస్పత్రిలో ఆయనను కలిసి వివిధ ఆస్పత్రులలో రెసిడెంట్ డాక్టర్లు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. తెలంగాణ జూడా అధ్యక్షుడు డాక్టర్ రాహుల్, ఉపాధ్యక్షుడు డాక్టర్ ఆశిశ్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఐజాక్ న్యూటన్, గాంధి జూడా అధ్యక్షుడు వంశీ, ఉపాధ్యక్షుడు డాక్టర్ అజయ్ కుమార్‌లు పాల్గొన్నారు.

పోస్టల్ హీరోలకు సత్కారం

సిటీబ్యూరో, ఆగస్టు 30(నమస్తే తెలంగాణ): పోస్టల్ శాఖలో అత్యున్నత ప్రదర్శన కనబరిచిన సిబ్బందిని సికింద్రాబాద్‌లోని పోస్ట్ మాస్టర్ జనరల్ కార్యాలయంలో ఉన్నతాధికారులు శుక్రవారం సత్కరించారు. 77 కేటగిరీల్లో ఉద్యోగుల ప్రతిభను గుర్తించి పోస్టల్ హీరోస్ పేరుతో సన్మాను చేశారు. ఈ సందర్భంగా జనరల్ పోస్ట్ మాస్టర్ టీఎం శ్రీలత మాట్లాడుతూ, గత ఏడాది ఆర్థిక సంవత్సరం నుంచి 2023-24 ఆర్థిక సంవత్సరానికి గాను రూ.20 కోట్ల ఆదాయాన్ని సమకూర్చినట్టు తెలిపారు. గత ఆర్థిక సంవత్సరంలో రూ.6 కోట్లు ఉండగా, 2023-24కి అది రూ.20 కోట్లకు పెరగడంలో సిబ్బంది కృషి అమోఘమని కొనియాడారు.

గాంధీ దవాఖానలో బీసీ నేతల ఆమరణ దీక్ష

సంఘీభావం తెలిపిన బీఆర్ఎస్ నేత ఆర్.ఎస్.ప్రవీణ్ కుమార్

గాంధీ దవాఖానలో ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్న వారిని కలిసిన ఆర్ఎస్.ప్రవీణ్ కుమార్

బన్సీలాల్‌పేట్, ఆగస్టు 30: కామారెడ్డిలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని, అధికారంలోకి రాగానే బీసీలను కాంగ్రెస్ మోసగించాలని చూస్తే రాష్ట్రం అగ్నిగుండంగా మారుతుందని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్ఎస్.ప్రవీణ్ కుమార్ అన్నారు. ఆరు రోజులుగా నిరాహార దీక్ష చేస్తున్నా ప్రభుత్వం ఎందుకు స్పందించడం లేదన్నారు. కామారెడ్డి బీసీ డిక్లరేషన్ వెంటనే అమలు చేయాలని, బీసీ ఆజాది యూత్ ఫెడరేషన్ అధ్యక్షుడు జక్కని సంజయ్ నేత, హిందూ బీసీ మహాసభ అధ్యక్షుడు బత్తుల సిద్ధేశ్వర్ పటేల్‌లు ఆరు రోజులుగా ఆమరణ నిరాహార దీక్ష కొనసాగిస్తున్నారు. శుక్రవారం వారిని బీసీ రాజ్యాధికార సమితి అధ్యక్షుడు దాసు సురేశ్, జైస్వరాజ్ పార్టీ అధ్యక్షుడు కాసాని శ్రీనివాస్ రావు, బీఎస్పీ ప్రధాన కార్యదర్శి ఎర్ర కామేశ్, తెలంగాణ గౌడ సంఘం అధ్యక్షుడు నారాయణ గౌడ్, సోషల్ జస్టిస్ పార్టీ అధ్యక్షుడు చామకూర రాజు, ఇన్‌చార్జి కె.వెంకట్ గౌడ్, బీసీ ఆజాది సంఘ్ అధ్యక్షుడు డి.మహేశ్ గౌడ్, కార్యదర్శి విజయ్ కుమార్, అంబేద్కర్ అజాదీ సంఘం అధ్యక్షుడు కొంగర నరహరిలు పరామర్శించి, తమ సంఘీభావం తెలిపారు. అనంతరం, వారు మాట్లాడుతూ ఎన్నికలకు ముందు కామారెడ్డిలో జరిగిన బీసీ డిక్లరేషన్ సభలో రాహుల్ గాంధీ, రేవంత్‌రెడ్డిలు ప్రకటించిన విధంగా బీసీలకు 42 శాతం కోటా ఇచ్చాకనే ఎన్నికలకు వెళ్ళాలని డిమాండ్ చేశారు. వెంటనే సమగ్ర బీసీ జనాభా గణన చేపట్టాలన్నారు.

రేవంత్ రెడ్డి బీసీల ద్రోహి

అడ్డగుట్ట: మాయమాటలతో సీఎం రేవంత్ రెడ్డి బీసీలను నిలువునా మోసం చేస్తున్నారని విశ్వకర్మ సీనియర్ నాయకులు రుద్రోజు శివలింగం అన్నారు. బీసీ కుల గణన చేసి 42 శాతం రిజర్వేషన్ అమలు చేయాలని బీసీ నాయకులు సిద్ధేశ్వర్, సంజయ్ కుమార్‌లు ఆరు రోజులుగా నిరవధిక నిరాహార దీక్ష చేస్తున్నారు. అయితే, వీరి దీక్షను పోలీసులు భగ్నం చేసి గాంధీ ఆసుపత్రికి తరలించారు. అయినా కూడా వారిద్దరు గాంధీ ఆసుపత్రిలో దీక్షను కొనసాగిస్తున్నారు. విషయం తెలుసుకున్న రుద్రోజు శివలింగం శుక్రవారం వారిని ఆసుపత్రిలో కలిసి దీక్షకు మద్దతు తెలిపారు. శివలింగం మాట్లాడుతూ, ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ కామారెడ్డి సభలో బీసీ డిక్లరేషన్ ప్రకటించి మాట మార్చారని అన్నారు. రేవంత్‌రెడ్డి హామీని అమలు చేయకుండా స్థానిక ఎన్నికలకు సిద్ధమవుతున్నారని, మాట తప్పిన రేవంత్ బీసీల ద్రోహి అని ఆయన తెలియజేశారు.

టగ్ ఆఫ్ వార్ చాంపియన్‌షిప్

జర్మనీ వేదికగా వచ్చే నెల మూడో తేదీ నుంచి తొమ్మిదో తేదీ వరకు జరిగే వరల్డ్ ఔట్ డోర్ టగ్ ఆఫ్ వార్ చాంపియన్‌షిప్‌లో భారత జట్టుకు ఎంపికైన సంయుక్త, కౌశిక్‌ను హైదరాబాద్‌లో సాట్ జీ వీసీ, ఎండీ & సోనీ బాలాదేవి శుక్రవారం అభినందించారు. భారత దేశం తరుపున పాల్గొనే జట్టులో తొమ్మిది మంది సభ్యులతో కూడిన, ఎంపిక చేయబడిన రెండు జట్లలో పురుషుల విభాగంలో పి.కౌశిక్, మహిళల విభాగంలో పి. సంయుక్త ఎంపికయ్యారు.

మణెమ్మ గల్లీలో హైడ్రా కూల్చివేతలు

నాలా, రోడ్డుకు అడ్డంగా ఉన్న నిర్మాణాల తొలగింపు

ముషీరాబాద్, ఆగస్టు 30: రాంనగర్ మణెమ్మ గల్లీలో నాలా, రోడ్డును ఆక్రమించి నిర్మాణాలు చేపట్టిన కట్టడాలను హైడ్రా సిబ్బంది కూల్చివేశారు. భారీ పోలీసు బందోబస్తు నడుమ హైడ్రా అధికారులు ఆక్రమణలను నేలమట్టం చేశారు. హైడ్రా కమిషనర్ రంగనాథ్ ఆక్రమణలను పరిశీలించిన 24 గంటలోపే అక్రమ నిర్మాణాలను కూల్చివేయడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రణాళికా సిద్ధం చేయాలని టౌన్ ప్లానింగ్ అధికారులకు రంగనాథ్ ఆదేశించడంతో హుటాహుటిన మణెమ్మ గల్లీని సందర్శించి వివరాలు సేకరించారు. అటు టౌన్ ప్లానింగ్ అధికారులు, ఇటు రెవెన్యూ అధికారులు నాలా, రోడ్డును ఆక్రమించినట్లు నివేదిక ఇవ్వడంతో శుక్రవారం కూల్చివేతలు చేపట్టారు. భారీ పోలీసు బందోబస్తు నడుమ జేసీబీ, గ్యాస్ కట్టర్లు, ఆక్రమణలను నేలమట్టం చేశారు. సర్వే నం. 20, 21 వార్డ్ 155 బ్లాక్ జమిస్తాన్‌పూర్‌లో కొందరు వ్యక్తులు స్థలాన్ని ఆక్రమించి కల్లు కాంపౌండ్, మరొకరు నాలాను ఆక్రమించి ఇంటి నిర్మాణం చేట్టడంతో చర్యలు తీసుకున్నట్లు అధికారులు తెలిపారు. రోడ్డును ఆక్రమించి నిర్మించారన్న ఆరోపణల నేపథ్యం విక్రమ్, సాయి యాదవ్‌లకు చెందిన 50 గజాల స్థలంలో ఉన్న ఒక గది, ఎల్లయ్య పేరుతో ఉన్న మూడు అంతస్తుల నిర్మాణాన్ని తొలగించారు. టౌన్ ప్లానింగ్ ఏసీపీ దేవేందర్, సెక్షన్ ఆఫీసర్ హఫీజ్ ఆధ్వర్యంలో కూల్చివేతలు చేపట్టారు.

హిమాయత్‌సాగర్ చుట్టూ అధికారుల సర్వేలు

అక్రమ నిర్మాణాల గుర్తింపు

పలువురు బడా బాబుల ఫాంహౌస్ భవనాల లోపలికి హద్దులు..!

మణికొండ, ఆగస్టు 30: నగర శివారు ప్రాంతంలోని చారిత్రాత్మక హిమాయత్‌సాగర్ జలాశయం చుట్టూ శుక్రవారం జల మండలి, రెవెన్యూ, ఇరిగేషన్ శాఖల ఆధ్వర్యంలో సర్వేలు చేపట్టారు. కొన్ని రోజులుగా జలాశయాల నీటి పరివాహక ప్రాంతాల్లో నిర్మాణాలు, లే అవుట్లు వెలిశాయంటూ వస్తున్న ఆరోపణల నేపథ్యంలో గోప్యంగా అధికారులు సర్వేలు చేసినట్లు తెలిసింది. విషయాన్ని బయటకు పొక్కనీయకుండా అధికారులు వ్యవహరిస్తుండటంపై అనేక అనుమానాలను స్థానిక ప్రజలు వ్యక్తం చేస్తున్నారు. ప్రధానంగా మొయినాబాద్, శంషాబాద్ మండలాల పరిధిలో హిమాయత్‌సాగర్ జలాశయం చుట్టూ ప్రభుత్వంలోని కొంతమంది పెద్దల ఫాంహౌస్‌లు పూర్తిగా చెరువు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ల పరిధిలోకి వెళ్తుండటంతో మరోసారి అధికారులు కొలతలను చేపట్టినట్లు తెలిసింది. స్థానిక రెవెన్యూ అధికారుల వద్ద ఆయా గ్రామాల నక్ష పత్రాలను తీసుకుని, చెరువు గరిష్ట నీటి మట్టంతో కలిసి సర్వేలు చేయగా, దాదాపు 30 మంది ప్రముఖుల విలాసవంతమైన భవనాలు చెరువు సరిహద్దులో చూపుతున్నట్లు ఆయా శాఖల క్షేత్ర స్థాయి సిబ్బంది వెల్లడించారు. వీటి నివేదికలను ఉన్నతాధికారులకు పంపి వారి ఆదేశాల మేరకు చర్యలకు ఉపక్రమించనున్నట్లు తెలిసింది. అయితే, ఇదే విషయంపై జల మండలి, రెవెన్యూ అధికారులను వివరణ కోరేందుకు ప్రయత్నించగా, వారు అందుబాటులోకి రాలేదు.

ప్రాణాలు అడ్డుపెట్టి పేదల ఇండ్లు కాపాడుకుంటా..

కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

అల్లాపూర్, ఆగస్టు 30: నలభయ్యేండ్లుగా స్థిర నివాసాలు ఏర్పాటు చేసుకుని జీవనం సాగిస్తున్న నిరుపేదల జోలికొస్తే సహించేది లేదని, ప్రాణాలు ఇచ్చి అయినా వారి ఇండ్లు కాపాడుకుంటానని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు బస్తీవాసులకు హామీ ఇచ్చారు. సున్నం చెరువు ఎఫ్టీఎల్‌లో ఉన్న పద్మావతినగర్‌లో హైడ్రా నోటీసులు ఇచ్చిన కుటుంబాలను స్థానిక కార్పొరేటర్ సబీహా బేగంతో కలిసి శుక్రవారం ఎమ్మెల్యే కలిశారు. కూలీ పని చేసుకుని పైసా పైపా పోగు చేసుకుని స్థలాలు కొని రేకుల ఇండ్లు నిర్మించుకుని జీవనం సాగిస్తున్నామని, ఇప్పుడొచ్చి అధికారులు నోటీసులు ఇవ్వడంతో కంటి మీద కునుకు లేకుండా పోయిందని బస్తీవాసులు ఎమ్మెల్యేకు తమ గోడును వెల్లబుచ్చారు. దయ చేసి తమ ఇండ్లు కాపాడాలని, ఇండ్లు కూల్చేస్తే తమకు చావే దిక్కని బాధితులు ఎమ్మెల్యే వద్ద రోధించారు. వారి బాధను విన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ, 40 ఏండ్ల క్రితం ఇండ్లు కట్టుకొని జీవనం సాగిస్తున్న వారికి హైడ్రా ఇప్పుడు నోటీసులు ఇవ్వడం ఏంటని ప్రశ్నించారు. కూలీ పని చేసుకుని బతికే నిరుపేదలపై హైడ్రా అధికారులు తమ ప్రతాపం చూపడంతో భయభ్రాంతులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పేదల జోలికి వస్తే ఊరుకునే ప్రసక్తే లేదని, అవసరమైతే న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామని బాధితులకు ఎమ్మెల్యే భరోసానిచ్చారు. చెరువులు, కుంటలు కబ్జా చేసిన బడా బాబులు భవంతులను నిర్మించుకుంటే వాటిని కూల్చడం మర్చిపోయి, పేదలు నివసించే ప్రాంతాల్లో కూల్చివేతలు జరపడం సరికాదన్నారు. కొందరు కాంగ్రెస్ నాయకులు హైడ్రా అధికారులు, లీడర్లతో ఫొటోలు దిగి స్థానికంగా బిల్డర్లను బెదిరించి రూ.లక్షలు వసూళ్లు చేస్తున్నారని, అలాంటి వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.



బాధితులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు